క్లుప్తంగా

పిల్లలకు చిన్నతనం నుంచే మంచిని అలవర్చాలి



సమావేశంలో పాల్గొన్న స్వామి సేవ్యానందజీ తదితరులు

సీటీఆర్ఐ: చిన్నప్పటి నుంచే పిల్లలకు సత్యం, సేవ, ప్రేమ, భక్తి, ధర్మపరాయణత అలవాటు చేయాలని స్వామి సేవ్యానందజీ అన్నారు. ఆదివారం స్థానిక రామకృష్ణ మఠంలో పేరెంట్స్ ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల సమగ్ర ఎదుగుదల, చక్కని శీల నిర్మాణం, వ్యక్తిత్వ వికాసం కోసం చేసే కృషిలో భాగంటా తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ, తల్లిదండ్రులకు క్రమశిక్షణ ఉంటేనే పిల్లలకు కూడా అది అలవడుతుందన్నారు. పెద్దలు ఆచరణలో పెట్టినవే చూసి పిల్లలు నేర్చుకుంటారన్నారు. మంచి వ్యక్తులను సమాజంలో వెతకడం కాదు, ఇంట్లో నుంచే తయారవుతారన్నారు. స్వామి శశికాంతానందజీ మాట్లాడుతూ, విద్యార్థులకు తల్లి తొలి గురువని, తల్లి ఒడి తొలి బడి అన్నారు. ధర్మం విలువలు చిన్నప్పటి నుంచి తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్వామి పరిజ్ఞేయానందజీ, న్యాయవాది పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరం



శిబిరంలో నీతికథలు బోధిస్తున్న సభ్యురాలు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక ఇన్నీసుపేట శాఖా గ్రంథాలయంలో ఆదివారం వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. నీతి కథలు చెప్పడం, యోగా, చదరంగం, హ్యాండ్ క్రాఫ్ట్, లలిత సంగీతం, భగవద్గీత తరగతులు నిర్వహించారు. విద్యార్థులకు మజ్జిగ, బిస్కట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు మతల రమేష్, ఆదిరెడ్డి శ్రీనివాసు, సుబ్రహ్మణ్యం, బొడ్డు శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి మంత్రి పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి

ధవళేశ్వరం: గ్రామానికి చెందిన రంకిరెడ్డి వెంకటేష్ ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులను ఆదివారం వారి స్వగృహం వద్ద రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పరామర్శించారు. తొలుత వెంకటేష్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.

ఆదిత్యునికి పంచామృతాభిషేకం



పెదపూడి: జి.మామిడాడ గ్రామంలోని ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత ఆదిత్యుని దర్శనానికి ఆదివారం భక్తులు విశేష సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రధానార్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకాలు, వ్రత పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు ఆలయ కమిటీ వారు తీర్థ ప్రసాదాలు, అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

నడిస్తే.. నరకమే..!

- మున్సిపల్ కాలనీలోని వాకింగ్ ట్రాక్ నిర్మాణంలో లోపం
- ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం
- నడవలేమంటూ గగ్గోలు పెడుతున్న వాకర్లు



మెటల్ చిప్స్ వేయడంతో వాకింగ్ ట్రాక్ బయట నడుస్తున్న వాకర్లు

రాజమహేంద్రవరం సిటీ: కొండ నాలుకకు మందు వేస్తే.. ఉన్న నాలుక ఊడినట్టుగా తయారైంది ఆ వాకింగ్ ట్రాక్ చూస్తే. ఆరోగ్యం కోసం దీనిపై నడిస్తే.. నరకాన్ని తలపిస్తోందని మండిపడుతున్నారు వాకర్లు. తమకు అక్కరకు రాని దీని దుస్థితిని చూసి మున్సిపల్‌కాలనీ వాకర్ల సంఘ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరోగ్యాన్ని పెంపొందించుకోవడానికి నడక వ్యాయామం చేద్దామని వాకింగ్‌కు వస్తే.. మోకాళ్లు, చీలమండలు, కీళ్ల నొప్పులు మిగులుతున్నాయని అంటున్నారు. నగరంలోని 42వ డివిజన్ మున్సిపల్ కాలనీలో మున్సిపల్ మైదానాన్ని నగరపాలక సంస్థ లక్షల రూపాయలతో ఆధునీకరించే చర్యలు చేపట్టింది. ఆధునీకరణలో భాగంగా వాకింగ్ ట్రాక్‌ను అభివృద్ధి చేశారు. నిబంధనల ప్రకారం చేపట్టాల్సిన పనులను నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరించారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మట్టి, గ్రావెల్ వేయాల్సిన వాకింగ్ ట్రాక్‌పై మెటల్ చిప్స్ వేసి చేతులు దులుపుకొన్నారు. ఈ వాకింగ్ ట్రాక్‌పై నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్‌కు వచ్చే వారంతా అధికారులు, కాంట్రాక్టర్ అవగాహన లోపంతో చేసిన పనికి అవాక్కవుతున్నారు. ఆరోగ్యం మాట దేవుడెరుగు.. ఈ వాకింగ్ ట్రాక్ కాస్తా లేనిపోని ఆరోగ్య సమస్యలు తెచ్చి పెడుతుందని వాకర్లు వాపోతున్నారు.

ప్రజాధనం 'నేల'పాలు

నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో లక్షల రూపాయలు వెచ్చించి స్థానిక మున్సిపల్ కాలనీలోని మున్సిపల్ మైదానంలో అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ పార్క్‌లోని వాకింగ్ ట్రాక్‌పై వాకింగ్‌కు అనుకూలంగా మట్టి, గ్రావెల్ వేయాల్సి ఉంది. కాంట్రాక్టర్



ట్రాక్‌పై వేసిన చిప్స్ చూపిస్తున్న శ్రీనివాస్

మెటల్ చిప్స్ వేయడంతో నడిచేందుకు తీవ్ర ఇబ్బందికరంగా మారిందని వాకర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మెటల్ చిప్స్‌ను తక్షణమే తొలగించాలంటూ వాకర్లు నగరపాలక సంస్థ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. వాకింగ్ ట్రాక్‌పై చిప్స్ వేసిన విషయాన్ని కాంట్రాక్టర్‌ను ప్రశ్నించగా, మీ ఇష్టం వచ్చిన పని చేసుకోవాలంటూ సమాధానం చెబుతున్నారని వాకర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ మైదానంలో జరిగిన వాకింగ్ ట్రాక్ పనులపై నగరపాలక సంస్థ కమిషనర్ విచారణ జరిపించి, చర్యలు చేపట్టాలని వాకర్లు కోరుతున్నారు. నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ ట్రాక్‌పై వాకింగ్ చేసేందుకు ఏమాత్రం అనువుగా లేకపోవడంతో, ట్రాక్‌ను వదిలి మైదానంలో నడవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాకర్లు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి వాకింగ్ ట్రాక్‌పై వేసిన చిప్స్‌ను తొలగించాలని మహిళలు విజ్ఞప్తి చేస్తున్నారు.

అత్యంత ప్రమాదకరం



వాకింగ్ చేసే సమయంలో మట్టి, గ్రావెల్ నేలపై నడవాల్సి ఉంది. సిమెంట్, మెటల్ రోడ్లపై నడక సాగిస్తే మోకాళ్ల నొప్పులు, చీల మండల నొప్పులు వచ్చే ప్రమాదం ఉంది. దీనివలన వాకర్లతో పాటు, నడిచే సమయంలో నేనూ ఇబ్బంది పడుతున్నాను. అధికారులు తక్షణమే స్పందించి దీనిపై చర్యలు చేపట్టాలి.

– డాక్టర్ కుమార్, మున్సిపల్ కాలనీ, రాజమహేంద్రవరం

కమిషనర్ పరిశీలించాలి

ప్రజలకు ఉపయోగపడేలా ప్రజాధనంతో ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్ వల్ల స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. కమిషనర్ తక్షణమే వాకింగ్ ట్రాక్‌ను పరిశీలించి ఇబ్బందులను తొలగించాలి. పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల ఈ దుస్థితి నెలకొంది. పదేళ్లలో ఇలాంటి దుస్థితి చూడలేదు.

– శ్రీనివాస్, మున్సిపల్ కాలనీ

చిన్నారుల పాలిట శాపం



వాకింగ్ ట్రాక్ వల్ల చిన్నారులు గాయాల పాలవుతున్నారు. మున్సిపల్ కాలనీ మైదానంలో ఆటలు ఆడుకునేందుకు వచ్చిన చిన్నారులు ప్రమాదాల పాలవుతున్నారు. గతంలో ఏ విధమైన ఇబ్బందులు ఉండేవి కావు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలి.

– వెంకటేశ్వరరావు, సభ్యుడు, మున్సిపల్ కాలనీ వాకర్ల సంఘం

చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ పంపిణీ చేస్తున్న మాజీ ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో ఉపయోగకరమని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్ అన్నారు. మార్గాని భరత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సీతంపేట సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మజ్జిగను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: రీవ్యాంప్‌డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్ (ఆర్డీఎస్ఎస్) పనుల్లో భాగంగా సోమ, మంగళ, బుధవారాల్లో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శ్యామ్యూల్ ఆదివారం ఇక్కడ తెలిపారు. ఉదయం 7.30 నుంచి 11.30 వరకు, తిరిగి మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 6.30 వరకూ అంతరాయం ఉంటుందన్నారు. పోలీస్ క్వార్టర్స్, స్వరూప్‌నగర్, బాలాజీనగర్, తారక రామనగర్, రూపానగర్, ఫ్యూచర్ కిడ్స్ స్కూల్ ఏరియా, కవలగొయ్యి, పిడింగొయ్యి, శ్రీరాంపురం తదితర ప్రాంతాల్లో ప్రభావం ఉంటుందని తెలిపారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



కొంతమూరు ఈఏఆర్ స్కూల్‌లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

రాజమహేంద్రవరం రూరల్: కొంతమూరు ఈఏఆర్ ఎయిడెడ్ హైస్కూల్ 2009–10 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాల ప్రాంగణంలో అపూర్వ సమ్మేళనం పేరుతో సందడి చేశారు. సుమారు 70 మంది కుటుంబ సమేతంగా కలిసి తాము చదువుకున్న పాఠశాల ప్రాంగణంలో అప్పటి నిక్‌నేమ్‌లతో ఒకరినొకరు పిలుచుకుంటూ గత జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. తమకు పాఠాలు బోధించిన ప్రధానోపాధ్యాయుడు కె.ప్రభాకరరావు, ఉపాధ్యాయులు స్వర్ణలత, ఎన్.మీనా, వి.బెన్ని, బాషా, విల్సన్‌రాజు, సీహెచ్ సాయికృష్ణ, ఎం అప్పారావును పేరుపేరునా గుర్తు చేసుకున్నారు. వారు నేర్పిన క్రమశిక్షణ, విద్యాబుద్ధులు తమను ఉన్నత స్థితికి చేర్చాయని, గురువుల దీవెనలు ఎంతో విలువైనవని తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. అప్పటి ప్రధానోపాధ్యాయులు ప్రభాకరరావును ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు ఏలూరి సాయికృష్ణ, యామన సునీల్, డి.నాగమణి, ఎస్.చండీప్రియ ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వీరికి పూర్వ విద్యార్థులంతా కృతజ్ఞతలు తెలిపారు.

నేడు ఏపీజీఈఏ జిల్లా కమిటీ సమావేశం



సమావేశంలో పాల్గొన్న సంఘ నాయకులు

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పి.గిరిప్రసాద్ అన్నారు. ఆదివారం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో సంఘ జిల్లా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలోని అన్ని శాఖల, అన్ని కేడర్ల ఉద్యోగుల కోసం నిరంతరం పని చేస్తున్న ఏకైక ఉద్యోగుల సంఘం ఏపీజీఈఏ అన్నారు. భజనపరులెవరో, పోరాట యోధులెవరో తమ నాయకుడు కేఆర్ సూర్యనారాయణ ప్రపంచానికి చాటిచెప్పారన్నారు. సోమవారం సాయంత్రం జరగనున్న జిల్లా కమిటీ సమావేశంలో జిల్లాలోని ఉద్యోగుల సమస్యలపై చర్చిస్తామన్నారు. సంఘ జిల్లా కార్యదర్శి సీహెచ్ఎస్ విల్సన్ పాల్ మాట్లాడుతూ, రెవెన్యూ ఉద్యోగులపై తీవ్రమైన పని ఒత్తిడిని తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘ ప్రతినిధులు వెంకటేశ్వరరావు, పి.రవికుమార్, ఎంవీబీ రామకృష్ణ, శ్రీనివాసరావు, మణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

వీర జవాన్లకు మద్దతుగా ర్యాలీ



ధవళేశ్వరంలో జరిగిన ర్యాలీలో పాల్గొన్న యువకులు

ధవళేశ్వరం: భారత్–పాకిస్తాన్ యుద్ధంలో అమరులైన వీరజవాన్లకు మద్దతుగా ధవళేశ్వరంలో గ్రామ ప్రముఖుడు తలారి మూర్తి ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. ధవళేశ్వరం సాయిబాబా గుడి నుంచి ప్రారంభమైన ర్యాలీ స్థానిక కాటన్ బ్యారేజ్ సెంటర్ వరకు సాగింది. గ్రామంలో యువకులు అధిక సంఖ్యలో ర్యాలీలో పాల్గొన్నారు. కొవ్వొత్తులు వెలిగించి వీర జవాన్లకు మద్దతుగా పెద్దఎత్తున నినాదాలు చేశారు.

మాతృమూర్తులతోనే సమాజాభివృద్ధి సాధ్యం



మాతృమూర్తులను సత్కరిస్తున్న డాక్టర్ గుబ్బల రాంబాబు

రాజమహేంద్రవరం సిటీ: భారతీయ సమాజంలో మాతృమూర్తి పాత్ర చాలా బలమైనదని, తల్లిని గౌరవించడం, పూజించడం సంస్కృతీ సంప్రదాయాల్లో ముఖ్యభాగమని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమం వ్యవస్థాపకుడు డాక్టర్ గుబ్బల రాంబాబు అన్నారు. మాతృ దినోత్సవం సందర్భంగా ఆదివారం స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమ ప్రాంగణంలో మాతృమూర్తికి వందనం పేరిట వృద్ధాశ్రమంలో ఉంటున్న మాతృమూర్తులను ఘనంగా సత్కరించారు. రాంబాబు మాట్లాడుతూ, 27 ఏళ్లుగా వందలాది మంది మాతృమూర్తులకు స్వర్ణాంధ్ర నివాసం కల్పించి ఆదుకుందన్నారు. స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమం నిర్వహణలో మాతృమూర్తుల పాత్ర చాలా విలువైనదని, వారు అన్నింటా సహకారులుగా ఉంటూ సమస్త నిర్వహణకు తోడ్పాటు అందిస్తున్నారని కొనియాడారు. మాతృమూర్తులను సత్కరించుకోవడం చాలా ఆనందంగా ఉందని, సమస్త ప్రాంగణంలో ఉంటున్న మాతృమూర్తులకు, వారి కుటుంబానికి ఏ కష్టం వచ్చినా స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమం ఆదుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో స్వర్ణాంధ్ర సిబ్బంది శేఖర్, గణేష్, హరికృష్ణ, మీరాకుమారి, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి తీవ్ర గాయాలు



క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో తరలిస్తున్న సిబ్బంది

సీతానగరం: మండలంలోని వంగలపూడి వద్ద మోటారు సైకిల్ అదుపుతప్పడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఆదివారం మధ్యాహ్నం వంగలపూడికి చెందిన 27 ఏళ్ల ఆకుమూరి జోషి మోటారు సైకిల్‌పై సీతానగరం బయలుదేరాడు. వంగలపూడి ఏటిగట్టుపై ఇసుక ఉండటంతో మోటారు సైకిల్ అదుపుతప్పి పడిపోయింది. ఈ ఘటనలో జోషి తల, ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఇచ్చిన సమాచారంతో 108 అంబులెన్స్‌లో ఈఎంటీ ముత్యం శ్రీనివాస్, పైలట్ లక్ష్మణ్ అతడికి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం చికిత్స కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మాజీ మంత్రిపై సీఐ ప్రవర్తన అనుచితం

వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొండపల్లి

కోరుకొండ: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నేత విడదల రజనీపై చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బనాయుడు అనుచిత ప్రవర్తనను పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు కొండపల్లి దుర్గారావు ఖండించారు. ఆదివారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. సీఐ సుబ్బానాయుడు రజనీని కారు నుంచి లాగి, తోసివేసి, సంస్కారం లేకుండా ప్రవర్తించడాన్ని తప్పుపట్టారు. రాష్ట్రంలో పోలీసులు అంబేడ్కర్ రాజ్యాంగాన్ని కాకుండా, రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అనుసరిస్తున్నారని దుయ్యబట్టారు. నడిరోడ్డుపై సీఐ సుబ్బనాయుడు బరితెగించి వ్యవహరించిన తీరు అప్రజ్వామికమన్నారు.

12 నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

రంగంపేట: ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 12వ తేదీ నుంచి జరుగుతాయని రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, చీఫ్ సూపరింటెండెంట్ బి.హేమ తెలిపారు. ఆదివారం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, 12 నుంచి 19 వరకు జరిగే ఈ పరీక్షలకు 344 మంది విద్యార్థులు హాజరవుతారని చెప్పారు. ఈ పరీక్షలకు జనరల్, ఒకేషనల్ విద్యార్థులు హాజరువుతారన్నారు.

విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోవాలి

పెదపూడి: విద్యార్థి దశ నుంచి విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకుని, ఆధ్యాత్మిక భావాలు పెంపొందించుకోవాలని కరకుదురు గ్రామం సేవకీయం ట్రస్ట్ వైస్ చైర్మన్ పాటంశెట్టి త్రిమూర్తులు అన్నారు. కరకుదురు గ్రామంలో వేణుగోపాల స్వామి ఆలయంలో సేవకీయం ట్రస్ట్, వేణుగోపాల సత్సంగం వారు పది రోజులుగా 50 మంది చిన్నారులకు చిత్రలేఖనం, ఆధ్యాత్మికతపై వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో విజేతలకు ఆదివారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా త్రిమూర్తులు మాట్లాడుతూ, వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వేణుగోపాలస్వామి ఆలయ ధర్మకర్త యెంద్రు వెంకటసుబ్బారావు, అర్చకుడు వాడపల్లి శేషాచార్యులు, కనకదుర్గ దేవి ఆలయ ధర్మకర్త టి.శ్రీను, వారాహి మహిళా మండలి అధ్యక్షురాలు పాటంశెట్టి కాశీరాణి, నున్న లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కట్లమ్మ జాతర



పొన్ను వేస్తున్న భక్తులు

బిక్కవోలు: పందలపాక గ్రామంలో కొలువైన కట్లమ్మ తల్లి జాతర అంగరంగ వైభవంగా జరిగింది. ఆదివారం రాత్రి మూడేళ్ల తర్వాత అమ్మవారి జాతర ఘనంగా నిర్వహించడంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయం వద్ద చిన్నారులు కాగడాలు వెలిగించారు. అనంతరం గరగ నృత్యాలు, తీన్మార్, శక్తివేషాలు, బ్యాండ్‌మేళాలు, డీజే సౌండ్స్, కేరళ వాయిద్యాలు, కోయడ్యాన్సులు, మిరుమిట్లు గొలిపే బాణసంచా కాల్పులు ఆకట్టుకున్నాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీఎత్తున పోలీసు బందోబస్తు నిర్వహించారు.



అమ్మవారి జాతరలో ఆకట్టుకున్న శక్తి వేషధారులు



అమ్మవారి జాతరలో గరగ నృత్యాలు



కేరళ వ్యాయిదాలతో కళాకారులు



అమ్మవారిని ఊయల ఊపుతున్న భక్తులు



కాగడాలు వెలిగిస్తున్న చిన్నారులు